www.aksharatoday.com

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND


### కామారెడ్డి సీఐగా నరహరి..

**అక్షరటుడే, కామారెడ్డి:** రాష్ట్రంలోని మల్టీ జోన్–1 పరిధిలో ఏడుగురు ఇన్‌స్పెక్టర్లను ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా కామారెడ్డి సీఐ చంద్రశేఖర్ రెడ్డిపై బదిలీ వేటు పడింది. ఆయనను ఐజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. నూతన సీఐగా వెయిటింగ్‌లో ఉన్న బి.నరహరిని నియమించారు.


23-6-2025 (MONDAY) NIZAMABAD/KAMAREDDY EDITION PAGES-3




కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి పూలమొక్క అందజేస్తున్న ట్రైనీ ఐఏఎస్ కరోలిన్

### జిల్లాకు ట్రైనీ ఐఏఎస్

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాకు శిక్షణ ఐఏఎస్ కరోలిన్ చింగ్తియాన్మావిను ప్రభుత్వం కేటాయించింది. సోమవారం మొదటిరోజు జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఆమె పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయా శాఖాధికారులతో పలు అంశాలపై ఆమె చర్చించారు.

### ఎస్సై, ఏఎస్సై సంతకాల ఫోర్జరీ..

## కానిస్టేబుల్ సస్పెన్షన్

**అక్షరటుడే, కామారెడ్డి:** ఎస్సై, ఏఎస్సై సంతకాలను ఫోర్జరీ చేస్తూ దుర్వినియోగానికి పాల్పడుతున్న పెద్ద కొడప్‌గల్ కానిస్టేబుల్ రవికుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ రాజేష్ చంద్ర సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొడప్‌గల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో కానిస్టేబుల్ కె.రవికుమార్ బస్సు వారంట్ల కోసం ఏఎస్సై సంతకాలను ఫోర్జరీ చేశాడు. అలాగే విధులకు గైర్హాజరైనప్పుడు ఉన్నతాధికారులకు ఎస్సై సంతకాలను ఫోర్జరీ చేసి తప్పుడు నివేదికలు పంపించాడు. ఇలా కానిస్టేబుల్‌పై వచ్చిన ఆరోపణలపై బాన్సువాడ డీఎస్పీ నివేదికను పరిశీలించిన ఎస్పీ రాజేష్ చంద్ర తీవ్రంగా పరిగణించారు. ప్రస్తుతం దేవునిపల్లి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రవికుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో ఎవరైనా బాధ్యతారాహిత్య ప్రవర్తన లేదా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.



# ధరణి.. వసతుల లేమి..

- వెంచర్‌లో కనీస సౌకర్యాలు కరువు
- ప్లాట్లు కొని మోసపోయామంటున్న బాధితులు
- మూడేళ్లయినా పట్టించుకోని అధికారులు

గత ప్రభుత్వం ధరణి పేరిట పలు జిల్లాలో వెంచర్లు ఏర్పాటు చేసింది. వేలం పాట ద్వారా ప్లాట్లు, ఇళ్లను విక్రయించింది. కామారెడ్డి జిల్లాలో కూడా ధరణి టౌన్ షిప్ ఏర్పాటు చేయగా అనేక మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసి మూడేళ్లయినా కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై యజమానాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రు. అన్ని సౌకర్యాలు ఉంటేనే ప్రైవేటు వెంచర్ల అనుమతులు ఇచ్చే అధికారులు ప్రభుత్వ వెంచర్‌లో సౌకర్యాలు కల్పించకపోవడం గమనార్హం. -అక్షరటుడే, కామారెడ్డి

రాజీవ్ స్వగృహ పేరుతో గతంలో కాంగ్రెస్ హయాంలో కామారెడ్డి పట్టణానికి సమీపంలోని అడ్లూరు శివారులో దాదాపు 20 ఎకరాల్లో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే మధ్యలోనే పనులు నిలిచిపోవడంతో ఆ ప్లాట్లు, నిర్మించిన ఇళ్లు ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2022లో రాజీవ్ స్వగృహ ఇళ్లు, ప్లాట్లను వేలం వేశారు. ధరణి టౌన్ షిప్ పేరుతో వెంచర్ చేసి ప్లాట్లను విక్రయించారు. అయితే మొదట్లో ప్లాట్లు కొనుగోలు చేయడానికి ప్రజలు ఎవరు ముందుకు రాలేదు. దీంతో కలెక్టర్, అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు, ఉద్యోగులు, ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చి ప్లాట్లు కొనిపించారు.అయితే మూడేళ్లుగా అక్కడ ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో కొనుగోలు చేసిన ప్రజలు ప్రస్తుతం ఆందోళన చెందుతున్నారు. నాడు అధికారుల మాటలు విని మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.



### రూ.50 కోట్ల ఆదాయం

ధరణి టౌన్ షిప్‌లోని 543 ప్లాట్లు, ఇళ్లకు నాలుగు విడతల్లో వేలం వేశారు. అయితే 326 ప్లాట్లు, 31 ఇళ్లు మాత్రమే అమ్ముడుపోయాయి. వీటి అమ్మకం ద్వారా ప్రభుత్వానికి రూ.50 కోట్ల మేర ఆదాయం లభించింది. టౌన్‌షిప్ అభివృద్ధి కోసం రూ.13.6 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపించారు. అయితే ప్రభుత్వం రూ.78 లక్షలు మాత్రమే విడుదల చేసింది. దీంతో ఒక వాటర్ ట్యాంక్, చుట్టూ గేట్లు, 80 శాతం విద్యుత్ పనులు చేపట్టి అధికారులు చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం టౌన్ షిప్ లో ఏపుగా చెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది.

### వసతులు కల్పించాలి



కలెక్టర్ మాట విని ప్లాట్ కొన్నాను. ఆరు నెలల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, కరెంట్, పార్కులు ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చారు. మూడేళ్లయింది. ఇప్పటికి అతిగతి లేదు. వెంటనే మాకు వసతులు కల్పించి అందులో నివాసం ఉండేలా చేయాలి. **- వెంకట్ రెడ్డి, బాధితుడు**

### మాటలు నమ్మి మోసపోయాం



తక్కువ ధరకు ప్లాట్ వస్తుందని చెప్పారు. సిటీకి దూరంగా ప్రశాంతంగా ఇల్లు కట్టకుని ఉందామను కున్నాం. అధికారుల మాటలు నమ్మి మోసపోయాం. ఇప్పుడు మమ్మల్ని రోడ్డున పడేశారు. వెంటనే టౌన్‌షిప్‌లో వసతులు కల్పించాలి. **- నరేష్, బాధితుడు**

### భయం వేస్తోంది



ధరణి టౌన్‌షిప్ వేలం సమయంలో ఒక్క చెట్టు కూడా లేకుండా చదును చేశారు. ఇప్పుడు చూస్తే చెట్లు, పొదలతో భయం వేస్తోంది. అందులో ఎన్ని విషపురుగులు ఉన్నాయో తెలియదు. ఇలాంటి స్థలంలో ఉండటం అంటే కష్టమే. ప్రభుత్వం స్పందించాలి. **- పెంటమ్మ, బాధితురాలు**

# 29న అమిత్ షా రాక

### పసుపు బోర్డుతో కొత్త శకం ఆరంభం.. : ఎంపీ అర్వింద్

**అక్షరటుడే, ఇందూరు:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈనెల 29న నిజామాబాద్ వస్తున్నట్లు ఎంపీ అర్వింద్ తెలిపారు. సోమవారం ఆయన నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లావాసుల చిరకాల వాంఛ అయిన జాతీయ పసుపు బోర్డు కేంద్ర కార్యాలయాన్ని అమిత్‌షా ప్రారంభిస్తారని ఎంపీ తెలిపారు. అదేరోజు రైతు సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీ తెలిపా రు. పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో జరిగే ఈ కార్యక్రమానికి వేలాది మంది రైతులు తరలివస్తారని స్పష్టం చేశారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో పసుపు బోర్డు కోసం పోటీ చేసిన అభ్యర్థులు ఇతర పసుపు రైతులను తీసుకొని తరలిరావాలని ఆయన కోరారు.

**డీఎస్ విగ్రహావిష్కరణ:** అమిత్‌షా ఇందూర్‌లో పర్యటించే రోజే తన తండ్రి డీఎస్ ప్రథమ వర్ధంతి అని ఎంపీ అన్నారు. డీఎస్ విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఎస్ విగ్రహాన్ని తానే తయారు చేయించానన్నారు. ఆ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ విగ్రహాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రారంభిస్తారన్నారు. అనంతరం పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో జరిగే రైతు సమ్మేళనంలో మాట్లాడతారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, ఎమ్మెల్యే ధన్ పాల్, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

## కబ్జా స్థలంలో అక్రమ కట్టడాల కూల్చివేత..

నగరంలోని ధర్మపురి హిల్స్‌లో కబ్జాకు గురైన స్థలంలోని అక్రమ కట్టడాలను అధికారులు తొలగించారు. 12వ డివిజన్ పరిధిలోని ధర్మపురి హిల్స్ కాలనీలో ఉన్న మదీనా ఈద్గా సమీపంలో భూమి కబ్జాకు గురైంది. ఈ వ్యవహారంపై 'అక్షరటుడే'లో 'దర్జాగా కబ్జా..' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. కబ్జాకు గురైన స్థలంలో అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. - అక్షరటుడే, నిజామాబాద్



# గురుకులాల బిల్లులు వచ్చేనా!



- క్యాటరింగ్ బిల్లుల కోసం కాంట్రాక్టర్ల నిరీక్షణ
- పెండింగ్‌లో నాలుగు నెలల బకాయిలు

**గురుకుల పాఠశాలలకు క్యాటరింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో టెండర్లు దక్కించుకున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు కడుపు నింపే క్యాటరర్స్‌కి బిల్లులు రాకపోవడంతో అప్పుల పాలవుతున్నామని వారు వాపోతున్నారు. నాలుగు నెలలుగా బిల్లుల కోసం నిరీక్షిస్తున్నా.. ఫలితం లేకపోవడంతో వారు సేవలు నిలిపి వేయాలని నిర్ణయించారు. ఈ మేరకు జూలై 1నుంచి క్యాటరింగ్ సేవలు నిలిపివేస్తామని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.**

**- అక్షరటుడే, ఇందూరు**

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నిత్యం భోజనం అందించేందుకు ప్రతి ఏడాది ప్రభుత్వం టెండర్లను ఆహ్వానిస్తుంది. వీటిని దక్కించుకున్న వారు మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారాన్ని అందజేయాల్సి ఉంటుంది. చికెన్, మటన్, కిరాణా సామగ్రి సరఫరా చేయడానికి అధికారులు వేర్వేరుగా టెండర్లు నిర్వహిస్తారు. అలాగే క్యాటరింగ్ కోసం టెండర్ పిలుస్తాయి. వీరు విద్యార్థులకు వంట చేసి పెట్టాల్సి ఉంటుంది.

**జీతాలు చెల్లించలేక ఇబ్బందులు**

క్యాటరింగ్ చేసేవారికి ఒక్కో విద్యార్థికి నెలకు రూ.10 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. కానీ గత ఫిబ్రవరి నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో క్యాటరింగ్ టెండర్లు దక్కించుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అటు వర్కర్లకు కనీసం జీతాలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో మొత్తం 11 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఇందులో కొన్ని పదో తరగతి వరకు ఉంటే, మరికొన్ని ఇంటర్ వరకు కొనసాగుతున్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు ఆరు వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒక్కొక్కరికి రూ.పది చొప్పున నెలకు రూ.60వేలు క్యాటరర్స్‌కి చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఫిబ్రవరి నుంచి చెల్లించకపోవడంతో ఒక్కొక్కరికి రూ.2లక్షలకు పైగానే నిధులు రావాల్సి ఉంది.

**ఈ ఏడాది ఖరారు కాని టెండర్లు**

గురుకుల విద్యార్థులకు భోజనం అందించేందుకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం టెండర్లను ఆహ్వానిస్తుంది. కానీ ఈ ఏడాది మాత్రం ఇప్పటికీ దానిపై స్పష్టత లేదు. కొత్త టెండర్లు పిలిచే వరకు గత సంవత్సరం దక్కించుకున్న వారే కొనసాగాలని నిబంధన ఉంది. అయితే బిల్లులు రాకపోవడంతో క్యాటరర్స్ సేవలు నిలిపివేస్తామని ప్రకటించారు. తమకు నిధులు విడుదల చేయాలని, లేకపోతే క్యాటరింగ్ సేవలు నిలిపివేస్తామని ఇప్పటికే వారు అధికారులకు వినతిపత్రం అందించారు.



## ప్రజావాణికి పోటెత్తిన ఫిర్యాదులు

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజాసమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వినయ్ కృష్ణారెడ్డికి ఇది రెండో ప్రజావాణి. అయితే సోమవారం ఏకంగా 217 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, డీఆర్డీవో సాయాగౌడ్, ఇన్‌ఛార్జి డీపీవో శ్రీనివాస్, మెప్మా పీడీ రాజేందర్ వినతులను స్వీకరించారు.

## బీఏఎస్ విద్యార్థుల నిధులు విడుదల చేయాలి



**అక్షరటుడే, ఇందూరు:** బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ ముందు పలు పాఠశాలల విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమై 12 రోజులు కావస్తున్నా పాఠశాల యాజమాన్యాలు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదన్నారు.

## చెట్టును ఢీకొని వ్యక్తి మృతి



**అక్షరటుడే, నిజాంసాగర్:** చెట్టును టీవీఎస్ ఎక్సెల్ వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సుల్తాన్‌నగర్ శివారులో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మద్‌నగర్ మండల కేంద్రానికి చెందిన గని(30) అనే వ్యక్తి పెట్రోల్ విక్రయిస్తూ జీవిస్తున్నాడు. సోమవారం ఉదయం నిజాంసాగర్‌లోని పెట్రోల్ పంప్‌కు వెళ్తుండగా సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో కల్లు దుకాణం వద్ద ఎక్సెల్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో గని అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య షహనాజ్ ఫిర్యాదు మేరకు ఎస్సై శివకుమార్ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ..

**అక్షరటుడే, బోధన్:** అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన బోధన్ మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై మచ్చేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలంలోని పెంటకుర్దు గ్రామంలో చంద్రకళ (50) ఒంటరిగా నివాసముంటోంది. ఆమె కొడుకు పనినిమిత్తం మహారాష్ట్రలో ఉంటున్నాడు. అయితే సోమవారం ఆమె ఇంటి తలుపులు తెరవకపోవడంతో స్థానికులు గమనించగా అప్పటికే ఆమె మృతి చెందింది. ఆమె చెవి కమ్మలు, ఇతర ఆభరణాలు కనిపించడం లేదు. కాగా.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి మండలం తిమ్మాపూర్ తండాలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన నేనావత్ రవి(32) తనకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా నీరు పడుతుండగా, విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ కుడుముల సత్యనారాయణ మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

## శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

**అక్షరటుడే, ఆర్మూర్ కోటగిరి:** శ్యామా ప్రసాద్ **ముఖర్జీ నేటి యువతకు ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం** శ్యామా ప్రసాద్ **ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అలాగే** పోతంగల్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సోమవారం బలిదాన్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు కల్లూరి హన్మాండ్లు(బజరంగ్) తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి



పోతంగల్ మండల కేంద్రంలో..

## గురుకులాల్లో అన్ని వసతులు కల్పించాం

**అక్షరటుడే, బాన్సువాడ:** గురుకుల పాఠశాలలకు అన్నిరకాల వసతులు కల్పిస్తున్నామని వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బీర్కూర్ జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో రూ.26లక్షలతో నిర్మించనున్న అదనపు మరుగుదొడ్ల నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను కూడా హాస్టళ్లలో చదివిన విద్యార్థినేనన్నారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్యామల, వైస్ ఛైర్మన్ యామ రాములు, మాజీ ఎంపీపీ రఘు, తహశీల్దార్ లత, నాయకులు శశి, బోయిని శంకర్, బస్వరాజ్ పటేల్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

## బైక్ చోరీ కేసులో ఒకరి అరెస్ట్

**అక్షరటుడే, నిజాంసాగర్:** మండలంలోని మాగి గ్రామంలో బైక్ చోరీ ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. మండలంలోని వడ్డేపల్లికి చెందిన సాయిరాం గతనెల 26న మాగి గ్రామంలో కుస్తీ పోటీలు చూసేందుకు బైక్‌పై వచ్చాడు. అనంతరం వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం నర్సింగ్‌రావు పల్లి చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో చిన్న కొడప్‌గల్‌కు చెందిన రవి అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

## దొంగతనం కేసులో నిందితుడు..

**అక్షరటుడే, నిజాంసాగర్:** మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై శివకుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మన్నె శేఖర్ ఈనెల 8న ఇంటికి తాళం వేసి వెళ్లగా, ఆత్రం ప్రశాంత్ అనే వ్యక్తి ఇంట్లోకి చొరబడి 40తులాల వెండి కడియాలు, పట్టీలు, రూ.20వేల నగదు ఎత్తుకెళ్లాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, సోమవారం నిజాంసాగర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, నేరం ఒప్పుకున్నాడు. ఈ మేరకు అతన్ని అరెస్ట్ చేసి, అతని వద్ద చోరీ సొత్తు రికవరీ చేసినట్లు వెల్లడించారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని 2, 15 వారుల్లో పారిశుధ్య, ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. అలాగే ఇంటింటికీ తిరుగుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం, వీధి కుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, వార్డ్ ఆఫీసర్లు అవినాష్, చక్రధర్, జవాన్లు భాజన్న, శంకర్, మెప్మా ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో మూత్రశాల కూల్చివేత



**అక్షరటుడే నిజాంసాగర్:** మండలంలోని వెలగనూరు ప్రభుత్వ పాఠశాలలోని మూత్రశాలను ఆదివారం కూల్చివేశారు. 20ఏళ్ల క్రితం పాఠశాలలో మూత్రశాల నిర్మించారు. అయితే ఈ స్థలంపై కొన్నిరోజులుగా వివాదం కొనసాగుతోంది. పాఠశాల స్థలంలోనే యూరినల్స్ నిర్మించారని ఉపాధ్యాయులు పేర్కొంటుండగా.. తమ స్థలంలోనే నిర్మించారని స్కూల్ పక్కనే ఉండే వ్యక్తి వాదిస్తుండడంతో వివాదం నెలకొంది. అయితే సోమవారం స్కూల్ తెరిచేసరికి మూత్రశాల కూలిపోయి ఉంది. దీనిపై హెచ్ఎం లలిత ఎంఈవో తిరుపతిరెడ్డికి, జీపీ కార్యదర్శికి, ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎంఈవో మాట్లాడుతూ ఎవరూ లేని సమయంలో మూత్రశాలను కూల్చివేశారని.. జీపీ కార్యదర్శితో పాటు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశామని వివరించారు.

## నర్వలో బోరుబావి తవ్వకం



**అక్షరటుడే, నిజాంసాగర్:** మహమ్మద్ నగర్ మండలం నర్వ గ్రామంలో బోరుబావిని తవ్వించారు. పైడి ఎల్లారెడ్డి యువ సైన్యం, బజరంగ్‌దళ్, శివాజీ యూత్ ఆధ్వర్యంలో గ్రామంలోని గంగపుత్ర కాలనీలో సోమవారం బోరు వేయించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పైడి ఎల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అంజయ్య, మాజీ సర్పంచ్ రాములు, బీసీ సెల్ అధ్యక్షుడు రాజేష్ యాదవ్, సాయాగౌడ్, సాయిబాబా, ముదిరాజ్ సంఘం నేతలు బాలు, అశోక్, మోహన్,గంగపుత్ర కాలనీవాసులు, సంతోష్, రమేశ్, హన్మాండ్లు, అంజయ్య, విఠల్, వెంకట్, సాయిలు, బాలరాజు, తదితరుల పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూం గుత్తేదారుపై ఫిర్యాదు



**అక్షరటుడే నిజాంసాగర్:** బీఆర్ఎస్ హయాంలో డబుల్‌బెడ్ ఇళ్లు కట్టి బిల్లులు గోల్‌మాల్ చేసిన గుత్తేదారుపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాము ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్నామని తెలిపారు. అయితే బిల్లులు మంజూరయ్యాక అప్పటి సర్పంచ్‌లతో పాటు గుత్తేదారు వాటిని తమకు ఇవ్వలేదన్నారు. దీనికి మహమ్మద్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడవ సంతోష్ లబ్ధిదారులలకు మద్దతు పలికారు. లబ్ధిదారులందరికీ బిల్లులు అందేలా న్యాయం చేస్తామని హామీనిచ్చారు.

## కాంప్లెక్స్ పాఠశాలకు విరాళం



**అక్షరటుడే నిజాంసాగర్:** మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని కాంప్లెక్స్ పాఠశాలకు మండల పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు విరాళం అందజేశారు. పాఠశాలలో కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు కోసం మండల పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, వెంకటాద్రి రూ. 10వేల విరాళాన్ని హెచ్ఎం మధుసూదన్‌కు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ సంఘం బాధ్యులు వెంకటరమణ, పండరి, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## యాంటీ డ్రగ్స్‌పై అవగాహన



**అక్షరటుడే, బోధన్:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో పద్మ అన్నారు. పట్టణంలోని విద్యావికాస్ జూనియర్ కళాశాలలో సోమవారం యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువకులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు అన్నపూర్ణ, రాధిక, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

## అధిక ధరలకు పాఠ్యపుస్తకాల విక్రయాలను అరికట్టాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** ప్రైవేటు పాఠశాలల్లో అధిక ధరలకు పాఠ్యపుస్తకాల విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ (ఎస్) జిల్లా అధ్యక్షుడు ఎన్.బాలరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం బీర్కూర్ ఎంఈవో వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. 1వ తరగతి పుస్తకాలు రూ. 3వేల నుంచి రూ. 4వేల వసూలు చేస్తున్నారని అన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు పుస్తకాల కొనుగోళ్లు భారంగా మారాయని వారు వాపోయారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ(ఎస్) సాయికుమార్ పాల్గొన్నారు.

## అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలో గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎంఈవో నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా పట్టణంలో విద్యాసంస్థలు వెలుస్తున్నాయన్నారు. అధిక ఫీజులు వసూలు చేయడం వల్ల పేద విద్యార్థులు చదువులు మధ్యలో ఆపేసే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ పటేల్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, బాన్సువాడ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు పైడిమల్ లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కొనాల గంగారెడ్డి, లక్ష్మారెడ్డి, హరి, సాయి కిరణ్, ప్రసాద్, చిరంజీవి, మహేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్‌పై అమెరికా దాడులు ఆపాలి



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో ఇరాన్‌పై అమెరికా దాడులకు పాల్పడుతోందని, వెంటనే ఆపాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో విలేకరుల సమావేశంలో నిజామాబాద్ రూరల్, కామారెడ్డి జిల్లాల కార్యదర్శి వి.ప్రభాకర్, జిల్లా నాయకులు దేవారాం మాట్లాడుతూ.. అమెరికా దాడులు అంతర్జాతీయంగా ఉద్రిక్తతలను పెంచుతాయన్నారు. ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య యుద్ధంలో అమెరిక నేరుగా జోక్యం చేసుకోవడం, ఇరాన్‌పై దాడులకు పాల్పడడం ట్రంప్ దుందుడుకు చర్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ సబ్ డివిజన్ కార్యదర్శి బి.కిషన్, నాయకులు, రాజన్న, రవి, శ్రీనివాస్, అనిల్ కుమార్, రవి, తదితరులు పాల్గొన్నారు

## బీజేపీ ఆధ్వర్యంలో బలిదాన్ దివస్



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం బలిదాన్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 10,11 వార్డుల్లో మొక్కలు నాటారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో దేశం అన్నిరంగాల్లో ముందుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలకిషన్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## జీపీ కార్యదర్శి కుటుంబానికి ఆర్థికసాయం



**అక్షరటుడే ఇందల్వాయి:** మండలంలోని గన్నారం జీపీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు అందరూ కలిసి బాధిత కుటుంబానికి రూ. 15వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనంతరావు, జీపీ కార్యదర్శులు, మృతుడి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నడిపల్లి, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో లబ్ధిదారుల ఇళ్లకు మంజూరుపత్రాలు అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జిల్లా ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల కార్యదర్శి సుదర్శన్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఇబ్రహీం, యూత్ అధ్యక్షుడు విజయకాంత్, సీనియర్ నాయకులు ధన్‌రాజ్, సంతోష్, సుధాకర్ పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**అక్షరటుడే, భిక్కనూరు:** నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్ అన్నారు. భిక్కనూరు మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మంగళవారం ముగ్గు పోశారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూర వుతుందన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. గత ప్రభుత్వం నిరుపేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, మాజీ ఎంపీపీ బాల్యాల రేఖ, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు దయాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు భూమయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్ధిరాములు, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, రవి, పాల్గొన్నారు.

